

సి. ఉమాదేవి

# దుప్పటి

వసారాలో నవారు మంచం మీద తులసమ్మ "కణేల్ కణేల్" మంటూ దగ్గుతోంది. తల్లి దగ్గు ఒకవైపు, చెవిలో దోమల సంగీతపు హెూరు మరోవైపు. అసహనంగా చెవుల మీదుగా దుప్పటి కప్పుకుని ముడుచుకుని పడుకున్నాడు శేఖరం. అలా కాసేపు పడుకున్నాడో, లేదో అప్పుడే తెల్లవారిం దన్నట్లు భార్య గిన్నెలతో తకిట, తధిమి, తందాన అనిపిస్తోంది.

"అబ్బ! సరిగా నిద్రపోనివ్వరు కదా" అని మనసులోనే విసుక్కుంటూ, కళ్ళు నులుముకుంటూ నిద్ర లేచాడు శేఖరం.

శేఖరం ఓ మధ్య తరగతి మానవుడు. మానవుడు అనడం కన్నా యంత్రం అనడం సబబు. బొటాబొటీగా సరిపోయే సంపాదనకు మరింత జత చేర్చాలనే తాపత్రయంతో ఓవర్ టైమ్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు కూడా చేయడం కద్దు. కాని ఖర్చులు పెరిగి ఆదాయం తరిగి ఎప్పుడూ లోటు బడ్జెట్‌తో సతమతమవుతూంటాడు. అయితే తద్వారా ఉదయించిన నిరాశ నిస్పృహలతో వేళకు ఇంత తినడం, తరువాత ఉద్యోగం, ఆపైన నిద్ర - ఈ మూడింటినే పరమావధిగా భావించడం బాధ్యత గల కొడుకు ధర్మం కాదు. పరిస్థితులు కాని, పరిసరాలు కాని, తన వారి అవసరాలు కాని గుర్తించలేని స్థితిలో ఉన్నాడతను. కాని ఇంతటి జడత్వం తన కొడుకు మీద ప్రేమ ముందు ఎటు పోతుందో? కొడుకు పుట్టి రెండు నెలలు కాలేదు. భవిష్యత్తులో వాడి చదువు కోసం అప్పుడే రికరింగ్ డిపాజిట్ కట్టడం మొదలుపెట్టాడు. తను కన్నవాడి మీద మమకారం సహజమే. కాని తనను కన్నవారి మీద కూడా శ్రద్ధాశక్తులు చూపడం మనిషి కనీస కర్తవ్యం కదా!

నిద్ర లేవడం ఆలస్యం ఊయలలోని కొడుకుకు శుభోదయం పలికి, ఆ పైన స్నానం, భోజనం వగైరాలన్నీ పూర్తవగానే ఆఫీసుకు బయలుదేరాడు.

"ఏమండోయ్! మరిచిపోకండి నే చెప్పింది." జ్ఞాపకం చేసింది శేఖరం భార్య ఆరతి.

అప్పుడే గుర్తు కొచ్చినట్లు "అవు నవును. నువ్వు చెప్పింది గుర్తుంది" అంటూ గడప దాటాడు శేఖరం.

తల్లి కూడా పలకరించి గుర్తు చేస్తుందేమో అని గబగబా దాటే లోపలే పిలవనే పిలిచింది తులసమ్మ.

"నాయనా శేఖరం!" నూతిలోంచి వస్తున్నట్లుంది గొంతులోని మాట.

"ఆఁ ఆఁ గుర్తు కొచ్చింది. నిన్న మరిచిపోయాను. అయినా ఏదీ నాలుగు రోజులేగా అయింది చలి మొదలయి. జ్ఞాపకముండి చావట్లేదు. ఈ వేళ తెస్తాలే." జేబులు తడుముకుంటూ చెప్పాడు శేఖరం.

తులసమ్మకు పీడని దగ్గు, దానికి తోడు ఎడతెగని ఆయాసం. చలికాలం, ఎండాకాలం ఇలాంటి కాలాలకు అనుగుణంగా తట్టుకునే శరీర పటుత్వం ఉడిగిపోయిన మనిషి. అడపాతడపా కొడుకును ఓ దుప్పటి తెమ్మని అడుగుతోంది. ఏదీ? అదో అంటాడు, ఇదో అంటాడు. ఖర్చయిపోయింది అంటాడు అప్పుడే చలెక్కడ అంటాడు.

భార్య మరీ మరీ చెప్పి గుర్తు చేయడంతో ఓ దుప్పటి కొనాలని స్నేహితుడు తులసీరాంను తీసుకుని 'చేనేత వస్త్రాలయం'లో అడుగుపెట్టాడు ఆ సాయంత్రం. కాని ఆ స్నేహితుడే దుప్పటి కొనడానికి అడ్డుపుల్ల అవుతాడని ఊహించలేకపోయాడు శేఖరం.

నూరు రూపాయల చీర కేవలం అరవై. అంటే నలభై శాతం డిస్కవుంటు

తులసీరాం కన్నులు కువ్పతెప్పలుగా పడ్డ చీరలన్నిటినీ గాలించేశాడు.

రెండు చీరలు ఖరీదు చేశాడు తులసీరాం. అయితే నలభై రూపాయలు తక్కువయ్యేట్లున్నాయి. చీరలు వదులుకుంటే మళ్ళీ సెలక్షన్ కష్టం, లేదా మరెవరైనా ఆ చీరలు కొనేయవచ్చు.

"శేఖరం! కాస్త సర్దవేయ్. రేపే ఇచ్చేస్తాను. స్టాకు తరిగాక మంచి రంగు లేం మిగుల్తాయి?"

ఇక చేసే దేముంది? తన దగ్గర తగినన్ని డబ్బు ల్లేకపోయినా రెండు చీరలు కొని అప్పు చేసి ధైర్యంగా నిలబడిన స్నేహితుడి నే మనాలో తెలియక తెల్లబోయాడు శేఖరం.


"మరి దుప్పటి చూడవోయ్ ఇక" అని తులసీరాంవైపు మరో అడుగేస్తుంటే అతడినే వింతగా చూస్తూ ముందుకు కదిలాడు శేఖరం.

దుప్పటి కొనలేదని, స్నేహితుడికి డబ్బు అప్పిచ్చానని చెప్తే తులసమ్మ పేలవంగా నవ్వుకుని, చిరిగి మెత్తబడిన ఆ పాత దుప్పటినే మరింత దగ్గరకు లాక్కుని కాళ్ళు, చేతులు ముడుచుకుని పడుకుంది.

అలా మరో పక్షం రోజులు గడిచాయి. దుప్పటి మాటే మరిచిపోయాడు శేఖరం.

"నే నేమైనా కాశ్మీరు శాలువలు, ముఖమల్ రజాయిలు అడిగానా? ఓ మందపాటి దుప్పటి అడిగాను. అదీ అపురూపమే!"

తులసమ్మకు పాలు కాచి తీసుకు వచ్చిన ఆరతి అత్తగారి మాటలకు ఓ క్షణం బాధపడ్డా మళ్ళీ అంతలోనే తేరుకుంది. నిజమే ఒక దుప్పటి కొనడానికి ఇంత మరుపు, అశ్రద్ధ చూపే భర్తమీద ఆమెకూ విసుగు కలిగింది. కాని అతడిలో కూడా ఈ జాడ్యానికి బలీయమైన కారణం డబ్బు లేమి. పుట్టి రెండు నెలలు కాని కొడుకు కోసం రికరింగ్ కట్టడం మొదలెట్టాడు శేఖరం. కాని అదీ లోటు బడ్జెటే! ముందుగా తీసి వాడుకుంటే అదీ చేతికందేది అంతంత మాత్రమే. కొడుకు రాగాలాపనతో ఆలోచనలు మాని ఊయల




'దగ్గరకు నడిచింది ఆరతి. దోమ తెర తీసి పక్కన పెట్టింది. ఆ దోమ తెర తెచ్చిన రోజు తులసమ్మే మొదట సంతోషించిన వ్యక్తి. మనవడికి అన్నీ సవ్యంగా అమరితే చాలని, దుప్పటికి తొందర లేదని కొడుకుకు చెప్పేది. లేచి నిలబడి నాలుగడుగు లేయలేని స్థితి, మనవడి మూతి విరుపులు, నిష్కల్మషమైన చూపులు అన్నీ కొడుకు, కోడలు చెప్తుంటే విని ఆనందించేది. కాని కాలం ఆగదు. చలికాలం ప్రవేశించిందో, లేదో వెన్నులో నుంచి వణుకు పుట్టినట్లు గజగజలాడేది తులసమ్మ. అదిగో అప్పటి నుంచి 'దుప్పటి కావాలి' అని అడగసాగింది.

ఆ రోజు చలి మరీ ఎక్కువగా ఉంది. తులసమ్మకు దగ్గుతో ఊపిరాడ్డం లేదు. ఆరతి మిరియాల కషాయం కాచి ఇచ్చింది. ఆదివారం కావడంతో కాస్త ఇంటిపట్టునే ఉండి ఊయలలోని కొడుకును చూసుకుంటూ మురిసిపోతున్నాడు శేఖరం.

"ఏం కావాలిరా? జీన్స్ కావాలా? బ్యాగీస్ కావాలా?"ఉంగా... ఉంగా .. అంటున్నాడు కొడుకు. అందులోనే అర్థాలు వెతుక్కుంటున్నాడు శేఖరం.

కషాయం తాగిన తులసమ్మ దగ్గు కాస్త తగ్గుముఖం పట్టడంతో మగతగా కళ్ళు మూసుకుని పడుకుంది. కాని ఆరతికి మాత్రం కొడుకు తడుపుతున్న గుడ్డలు మార్చడంతోనే సరిపోతుంది. అలా కళ్ళు మూసుకుంటే చాలు ఇలా కెవ్వుమని లేస్తాడు కొడుకు. తన నిద్రకు భంగం కలిగించే మూడో మనిషి ఆ ఇంటిలోకి వచ్చాక శేఖరానికి కాస్త మత్తు వదిలిందనే చెప్పాలి. భార్య నిద్ర లేస్తే చాలు, తనూ లేచి అంతో ఇంతో సాయపడుతున్నాడు. అయితే వినుగు మాత్రం మొఖంలో కనబడనీయకుండా జాగ్రత్తపడుతున్నాడు.

అయితే అలా ఓ అరడజను సార్లు నిద్రాభంగ మయ్యేసరికి "అయినా ఇన్నిసార్లు పక్క తడపడ మేమిటి? ఎన్నిసార్లు ఇలా గుడ్డలు మార్చాలి?" అని అసహనంగా అడిగేశాడు.

"మీది మరీ చోద్యం. ఇందులో వింతేముంది. మీ అమ్మగారు మీకు చేయలేదా? మా అమ్మ నాకు చేయలేదా? తండ్రీ కొడుకు లిద్దరూ డిసెంబరు పుత్రు లయితిరి."

భార్య యథాలాపంగా అన్న మాటలు శేఖరానికి చెళ్ళున చరిచి నట్లయింది. యాంత్రికంగా తన కేమీ పట్టనట్లు ఉన్న శేఖరంలో అంతర్మథనం ప్రారంభమైంది.

'అవును. నిజమే. తన తల్లి తనకు చేసిన సేవలు ఈనాడు తనకు గుర్తు లేవు. అందుకే తన తల్లి అవసరాలు తనకు గుర్తు లేవు. తన అశ్రద్ధ, నిర్లక్ష్యం తన తల్లికి ఎంత క్షోభ కలిగించిందో! తల్లిదండ్రుల ఋణం తీరేది కాదు. కాని ఒక చిన్న ఓదార్పు! ఒక చల్లని మాట! ఒక చిన్న కోరిక తీర్చితే చాలు. అదే బ్రహ్మాండంగా మురిసిపోతారు.

"అబ్బబ్బ! మరీ అంతలా ఊపకండి. వా డెప్పుడో నిద్రపోయాడు. రేపు రెండు ప్యాకెట్లు 'డయాపర్స్' కొని తెండి. చలికాలంలో ఇన్ని గుడ్డలు మార్చి ఉతకలేను."

భార్య మాటలకు తల పంకిస్తూ కళ్ళు మూసుకుని ఆలోచనలో మునిగిపోయాడు శేఖరం.

ఆ మరునటి రోజు సాయంత్రం శేఖరం చేతిలో ప్యాకెట్టు చూసి ఆత్రంగా విప్పి చూడబోయింది ఆరతి. ఆశ్చర్యం! ప్యాకెట్టులో ఉన్నది మంచి మందమైన దుప్పటి.

దుప్పటి మాటే మరిచిపోయిన అత్తగారికి వెచ్చగా కప్పింది ఆరతి.


"అయ్యో! నాకు ఇప్పు డెందుకమ్మా? చలికి చంటాడు తట్టుకోలేడు. ఏదైనా చిన్న శాలువా తెచ్చి ఉంటే బాగుండేది." తులసమ్మ నెమ్మదిగా అంది.

తల్లిలోని ఉన్నత సంస్కారానికి, మాతృత్వపు మాధుర్యానికి శేఖరం కన్నులలో నీటి పొర తళుక్కుమని మెరిసింది.

★

ఒక అతితెలివి భార్యా, అమాయకపు భర్తా ఊరికెళ్ళబోతుంటే భార్య తెలివిగా "ఆరవ తరగతి, ఐదవ తరగతి చదువుతున్న మన అబ్బాయిలిద్దరినీ చెరో గోనె సంచిలో వేసి తీసుకెళ్దాం. మనకి డబ్బు ఆదా అవుతుంది" అంది.

సరేనని రెండు గోనె సంచులతో బస్సు ఎక్కాక ఆ అమాయకపు భర్త కండక్టర్‌తో "హైద్రాబాద్‌కి రెండు టిక్కెట్లివ్వండి. ఫిఫ్త్, సిక్స్త్ క్లాసులు చదివే ఆ రెండు



గోనె సంచులకి మాత్రం టిక్కెట్టు కొట్టకండి" అన్నాడు సీరియస్‌గా మొహం పెట్టి.

ఐరేని శ్రీనివాస్‌గౌడ్